# అమ్మతల్లి

పూడిపెద్ది వెంకటరమణయ్య

ఇందలి కథ కొలది సంవత్సరాల క్రిందట ఏజన్సీప్రాంతాలలో జరిగిందని ఒక స్నేహితుడు నాకు చెప్పగా విని అది చాలా విధాల వినదగి ఉన్నదని ఊహించి దానిని చిన్నకథగా అల్లేను. —పూ. వెం. ర.

చెంగల్వరాయడు టీకాలరైటరు. టీకాలువేసే ఉద్యోగికి ఈ రైటరు పేరు ఎలా సార్థకమో నాకు తెలీదు. టీకాల డాక్టరంటే బాగుండునేమో! ఇతడు ఏజన్సీలో ఆటవికజనంలో టీకాలువేయవలసిన అవసరం కలిగిం దప్పుడు. తెలతెలవారుతూంది. ఎవరో ఒక గదబవాని సాయంతో ఆ గదబవలసో, గదబపల్లో ఏదో పేరుగల రెండు మూడు పుంజీల ఇలువరాలు గల గ్రామసమీపాన్న చిన్న గుడారమెత్తికొని మకాంచేసేడు. టీకాలు వేయడంపని ఎంతో సులభసాధ్యంగా కనబడుతుంది మనకి. ఏముంది? ఒక మనిషిచేయి అందుకొని వాని భుజాననో, ముంజేతనో రొంటరీలాన్నట్టు మందులో ముంచి గిరగిరా త్రిప్పేస్తాడు. కాని పాణిగ్రహణాని కెంత తంతు నడవాలో టీకాలువేయడానికి పాణిగ్రహణం చేయాలంటే అంతతంతు కావాలి. టీకాలంటే, అదేమిటోగాని, ప్రజలంత భయపడతారు. నాటుప్రజ చెప్పేవద్దు. ఆటవికుల కాగోలే తెలీదు. మన భాషా? మన ఊహా? ఎంతో నచ్చచెప్పాలి వాళ్లకి. ఆ కార్యభారం చెంగల్వరాయనిమీద పడ్డదానాడు. సరే సంసిద్ధపడ్డాడు. కాంపుమంచం, ఇక్మిక్ కుక్కరు, హోల్డాలు, థెర్మో ఫ్లాస్కు, మర చెంబూ తోన్నూ మకాంచేసేడా అడవిమధ్యను....

బస సదును చేసుకొని, సాపుచేసుకొని వంటచేసుకొని, భోజనంచేసుకొని ప్రచారం ప్రారంభించడానికి సిద్ధపడ్డాడు. హోల్డాలులో ఉన్న తన ఆయుధాలపెట్టె పైకి తీసేడు. మందు కొంచెమే ఉంది. లేనేలేదో. క్రొత్త మందు బంగీ తపాలాకచేరీకి వచ్చే ఉంటుంది. అక్కడకు తపాలాకచేరీ మూడుమైళ్లదూరంలో ఉంది. తనకు తైనాతీవచ్చిన 'రఘువ' అనే గదబవానిచేతికి ఒకచీటీ వ్రాసి యిచ్చి తపాలాధికారికి చూపుమని వానిని పంపి ఆ గుడారంనడుమ అమర్చుకున్న కాంపుమంచంమీద పడుకున్నాడు చెంగల్వరాయడు. మెత్తని దిండ్లలో తలపొదుపుకొని ఏదో వింత సంచలనం కలిగించే ఆ వన్యప్రదేశంలో, నిర్మలమయిన గాలిపీలుస్తూ కొత్తపక్షుల గీతాలు వింటూ ఏమేమో ఆలోచించుకుంటూ పడుక్కున్న చెంగల్వరాయనికి నిద్రపడుతూంది, మెలకువ వస్తూంది. తిరుగా నిద్రలోకి దూకుతున్నాడు. ఇలా ఎన్నిసారులు చేసేడో కడసారి ఆతడు కన్నులుతెరచికొని చూచేసరికి గుడారమంతా చీకటి వ్యాపిస్తూంది. దుబ్బువేసిం దనుకొని గుడారమీవలకు వచ్చి దిక్కులు పరీక్షించేడు, పడమటికొండచాటున పడుతున్నాది సూర్యబింబం. వెలుగుపస వెనుకాడుతూంది. ఆ అటవీప్రదేశం, ఆ గదబపల్లె, ఆ ప్రశాంతి సమయానన్నం ఇవన్నీ వానిని దిగులుతో దిగలాగడం మొదలుపెట్టేయి. వానికి ఒంటరితనం భూతంలాగు కనిపిస్తూంది. "రఘువా రఘువా" అని కోజుపిట్టలాగు గంటసేపు వాపోయేడు పిలుపుమీదపిలుపు శబ్దపటిమ హెచ్చిస్తూ. "రాలేదు కాబోలు. మూడుమైళ్లదూరములోనున్న తపాలాకచేరీకి వెళ్లిరావడమంటే ఇంతసేపేలా? అందులోనూ రఘువనికి గమనవేగానికి పెట్టినది పేరు. ఆటవికులకు విశ్వాస మెంతేని ఉంటుంది. చెప్పినపని తూచాలు తప్పకుండా చేస్తారు. పట్టుదలగల కార్యసాధకులు. ఏం చెప్మా రఘువా ఇంకా రాలేదు?" ఎవరు బదులుచెప్పేవారు? నిశ కార్కొంటూంది. నిశ్శబ్దం చిక్కబడుతూంది.

పరువుపరువున గదబపల్లెలోకి పోయి చెంగల్వరాయడీ కథ ఆపల్లెవారిలో కొందరికి వచ్చీరాని గదబభాషతోను, తెలుగు ఇంగ్లీషుముక్కలతోను దాన్ని సంపుటీకరణం చేసి, అభినయంతో కాస్త మెరుగుదిద్ది చెప్పేడు వారి మనస్సులను కరగించి; ఇద్దరు గదబయువకులను తోడు తెచ్చుకొని గుడారమున పడుక్కున్నాడు కాంపుమంచంమీద కదలకుండా . వన్యమృగాల భయం వానికి లేదు. గుడార ద్వారాన కూర్చుండి కావలికాస్తూన్న గదబవాళ్లున్నారు. చలిభయమూ వానికి లేదు. గుడారంచుట్టూ నెగళ్లు వెలుగుతున్నాయి. గుడారమంతటా

వచ్చిన గాలులే ప్రాకుతున్నాయి. దళమైన ఉన్నిదుప్పటి తలమున్కగా కప్పుకొని పడుకొన్నాడు చెంగల్వ రాయడు . వానికి నిద్రపట్టలేదు. రఘువ డేమయినాడు ? మందుపెట్టె ఏంచేసేడు? దానిలెక్క తేల్చకపోతే తాను చాల చిక్కులలో పడిపోవలసి వస్తుంది. పోస్టుమేస్టరు వాని కిచ్చేడో లేదో . ఏసంగతీ అనిశ్చితాంధకారం లాగు వాని కగమ్యగోచరమయింది. పడుతూ లేస్తూ పదిగంటల పరి మాణంగల ఆ రేయిని పది యుగాల్లాగ గడిపేడు. బల్లున తెల్లవారగానే గడబలను గుడారమునకు కాపు పెట్టి ఒక్కడే నాయూన పోస్టాఫీసుకు వెళ్లాడు చెంగల్వరాయడు.

రఘువడు వచ్చి మందుపెట్టె తీసికొని వెళ్లినట్టు తపాలాధికారి చెప్పేడు. చెంగల్వరాయనికి చిరు చెమటలు క్రమ్మేయి . ఏందారి ? దొరతనమువారితో పని. లోసుగులు క్షమించరు. మందుపెట్టెపోయినదంటే ఏమి శిక్ష విధిస్తారో అధికారులు ?

చేతి రుమాలతో మొగాన చెమట తుడుచుకొని విషాదంగా నిట్టూర్చి, వెతగడానికి దొరకొన్నాడు రఘువనూ, మందుపెట్టెనూ కూడా. అక్కడకు ఆరుమైళ్ల దూరమున నున్న 'బారిగాం' అనే చిన్న పల్లె రఘువని నివాసగ్రామం . ఆసంగతి తెలిసికొని ఆపల్లెకు నడచి వెళ్లేడు చెంగల్వరాయడు. ఎండ ముదిరి ఒళ్లు చిటచిట లాడుతూంది. చవిటినేలవలె ఒడలు చెమరిస్తూంది. రాత్రినుండీ ఆహారమెరుగని ఆశరీర భారానికి వాని పిక్కలు పీకి వడవడ వడకుతున్నాయి కాళ్లు . వేడియూర్పులు బుసకొడుతూ, నాల్క సవరించి పెదవులు తడపికొంటూ పొడిబారిన గొంతుబిగింపును సడలించికొంటూ కాలి ఆకుచెప్పులు తొట్రుపడ రెండు యామముల కా 'బారిగాం' చేరుకున్నాడు చెంగల్వరాయడు . ఊరి సమీపానికి రాగానే డప్పుల చడి వినబడుతూంది . ఏదో సందడిలో నున్నట్టున్నారు గ్రామస్థులు . ఊరి వెలుపలనున్న ఒకచెట్టునీడను తాను నిలచి ఆయూరి పెత్తనదారును పిలుచుకొని రమ్మని తనకు సాయంవచ్చిన గడబయువకుని పంపేడు గ్రామంలోకి. దూరంగా ఏదో గాతితో గోడలుతీర్చి కడుతున్నారు కొందరు గడబలు. దాని కుంద్రనా కట్టు బొటూచూస్తే దేవతాగారంలాగు తోస్తూంది. "ఈ మూఢనమ్మకం పోయిందికాదు వీళ్లకి. ఇంకా అమ్మవారు- బలులు! ఈ విశ్వాసం నానాట ప్రబలుతూంది. ఇలాటిచోట టీకాలపత్వం నచ్చచెప్పడం చాలా కష్టం. ఏం చెయ్యను ! రోటిలో తల దూర్చి రోకటిపోటుకు భయపడనా ?" అని యేమేమో ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఆ గ్రామంలోని సంబరం జనసమూహంతో, కలకలధ్వనితో, మిన్నంటే కేకలతో తనవైపే వస్తూంది. వాళ్లకు కానరాకుండా ఆ చెట్టుచాటున డాగి నిలచేడు చెంగల్వరాయడు- పరిసరజ్ఞానమే లేకుండా ఎగురుతూ దాటుతూ ఆ క్రొత్తగా కట్టే గుడివైపు పోతూంది ఆ సంబరం. ఆత డాసంబరంనడుమకు నిదానించి చూచేడు. కొందరి చేతులమీద వీరమరం బిగించి, పూలదండలతో ఫుక్కిటకల్లుతో ముందుకు చాచిన వాని అరచేతులలో ఏదో పట్టుకొని ఒకయువకుడు కూర్చున్నాడు. వానివైపు చూచి సంతోషంతో గంతులు వేస్తున్నారు ఆడా మగా కలసి. నడుమ నడుమ బలు లిస్తున్నారు. కోళ్లు గొంత్తులూకోసి రక్త చిమ్ముకుంటూ పచ్చిగంధపు ముద్దలు పట్టించుకుంటున్నారు ఒడళ్ల. పానకంవలె కల్లు జాడీలతో తాగేస్తున్నారు.

గ్రామం పెత్తనదారుకోసం చెంగల్వరాయడు పంపిన గడబవాడు తిరిగివచ్చి నరవాహనంమీద ఊగే గుతూన్న ఆ గడబయువకుని చూపుడువ్రేలితో చూపి "రఘువ" అన్నాడు . త్రుళ్లిపడి చెంగల్వ రాయడు వానివైపు చూచేడు. "ఔను వాడే. అదిగో ముఖాన స్ఫోటకపు గుంటలు - బట్టతల . ఆ పై మీద ఎఱ్ఱపంచ తానిచ్చిందే." అనుకొని సంభ్రమున వానికి జరుగుతూన్న ఆ గౌరవానికి కారణమేమని వానినడిగేడు. ఆ గడబవానికి తెలుగురాదు. గడబభాషలోనూ సంజ్ఞలతోనూ కూడా ఆ ఉత్సవ వివరాలు తెలిపేడు. అది యొక గ్రామదేవత ఉత్సవమని బోధపరచికొని చెంగల్వరాయడు ఊరకున్నాడు. "ఇది అమ్మతల్లి పండుగ కాదు, అమ్మమ్మ తల్లి పండుగ" అన్నాడా గడబవాడు. అది క్రొత్తపేరవడంచేత వానికి బోధపడకపోయినా తెలిసినట్టు జాలిగా తలయూచేడు చెంగల్వరాయడు. ఆ కడుతూన్న గుడీ ఆదేవతకొరకే అన్నాడు గడబవాడు. 'అంహాం' అన్నాడు చెంగల్వరాయడు.వాని కా మాటలు చెవిని పట్టలేదు. ఆకళ్లి

అంతరంగికంగానూ, ఎండ బాహ్యంగానూ వాని లోనూ పైనీ కూడా ప్రజ్వలిస్తున్నాయి. మందు పెట్టె ఏమయిందో వాని నడుగుదా మంటే వా డేనుగుమీదిసున్నమయి ఎక్కడో అంతరాళాన అందకుండా ఊరేగుతున్నాడు. తన బస అక్కడకు తొమ్మిది మైళ్ల దూరములో నున్నది. నిలువలేక పోయాడు, సొమ్మసిలి ఆచెట్టునీడను రాయి తలగడగ పడుక్కున్నాడు చెంగల్వ రాయుడు. వాని వైఖరి చూచి ఆ గదబవాడు వాని ఆకలి, దాహం విపరీతముగా నున్నవని పోల్చి - ఉడికించిన దుంపలు, వెదురుగొట్టముతో తేనే, తామరాకుదొన్నతో నీరూ తెచ్చి వానికిచ్చేడు. చెంగల్వరాయుడు కాస్త నల్లబడి సేదదేరి,

"రఘువని కలుసుకోవచ్చునా ?" అని ఆగదబవాని నడిగేడు. "వాడా గుడివద్ద ఉండవచ్చును. అందరూ వెడలిపోయారు పండడి చాలించి. మన మక్కడికి పోవచ్చు"నని వాడన్నాడు. చెంగల్వరాయుడు మెల్లగా వాని చేయూతను నడుస్తూ అమ్మమ్మ తల్లి క్రొత్త గుడిదగ్గరకు వెళ్లేడు. అక్కడెవ్వరూ లేరు. వారా దేవతనా గుడిలో ప్రతిష్ఠించి విందులారగించుటకు గ్రామంలోకి పోయారు. పొద్దు పడమటిదిక్కును సమీపిస్తూంది. కోడి వెండ్రుకలూ, నెత్తుటి మరకలతో నిండిన త్రోవ సరిచూచుకొంటూ ఆ దేవాలయ సమీపానికి వెళ్లేడు. అక్కడ నొక పూలకొట్టె మీద పొదుపుగ నుంచిన అమ్మమ్మ తల్లిని చూచేడు. ఆ చేరువను నెత్తుటిలో వత్తి వెలుగుతూంది. ఇంకా గుడికి పైకప్పు కట్టలేదు. ఆ దేవతవైపు నిదానించి చూచి త్రుళ్లిపడ్డాడు చెంగల్వరాయుడు. ఈలోగా దేవతకు సాష్టాంగపడి లేచిన గదబ యువకుడు వాని వైఖరి చూచి వాని నమ్మమ్మతల్లి పూనినదని భ్రమసి వాని చుట్టూ తిరుగుతూ ఏవో గదబ పాటలు పాడ మొదలుపెట్టేడు.

కొంత ధైర్యం తెచ్చుకొని చెంగల్వరాయడు ఆగదబవానిని వారించి, ఆ పూలకొట్టెపైనున్న దేమని వాని నడిగెను. "అదిరో అమ్మమ్మ తల్లి- దానిజాతరే సాగిస్తున్నారిప్పుడు ఈ ఊళ్ళ క్రొత్తగా. ఈ గుడి ఇంత వేగంగా ఈ దేవతకోసమే కడుతున్నా" రని ఆగదబయువకుడు బదులుచెప్పెను.

కాస్తధైర్యం తెచ్చుకొని

"నే నాగుడిలోనికివెళ్లి ఆ దేవతను చూడవచ్చునా ?" అన్నాడు.

గదబః-ఓ. ఆ ఉగ్రం భరించగలిగితే.

పిరికిదనంగా 'ప్రయత్నించిచూస్తా' నంటూ ఆ గుడిలోకి అమ్మమ్మతల్లి చేరువగా పోయి వంగి నిదానించి ఆ దేవతను చూచి చూచి, అదేదో చదివి తెలిసికొన్న ట్టీవలకు వచ్చి "నడేరా పోదా"మన్నా డాగదబ వానిని చెంగల్వరాయుడు. వారిరువురూ కలసి పోస్టుమాస్టరుదగ్గరకు వచ్చేరు.

చెంగః-అయ్యా పోస్టుమాస్టరు గారూ, మీ రామందుపెట్టె వానిచేతిలో పెట్టినప్పుడు వా డేమన్నాడో చెప్పగలరా ?

పోస్టు:-ఇదేమిటని వాడు నన్నడిగేడు. ఇది అమ్మవారిని చంపే దేవత అన్నాను. వా డతి జాగ్రత్తగా ఆపెట్టె నుతీసికొని వెడలిపోయాడు.

ఏం చెయ్యడమూ చెంగల్వరాయునికి తోచలేదు. గాని అమ్మమ్మ తల్లి జాతరలు మాత్రం అక్కడ మందుపెట్టెకు సాగుతున్నాయి.

